www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 2 జనవరి 2026

5

చిత్తూరు

## అరకును తలపిస్తున్న బంగారుపాళ్యం

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** మండలంలో ఉదయం పొగ మంచు కమ్మేస్తోంది. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో మండలం అరకు ను తలపిస్తోంది. గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విపరీతమైన మంచు కురవడంతో పరిసరాలు మొత్తం మంచి దుప్పటి కప్పినట్టు ఉంది. చలితీవ్రతకు స్థానికులు పగటి పూటకూడా చలిమంటలు వేసుకున్న పరిస్థితి కనిపిస్తోంది.

# కుంగిపోతే..మాకేంటి..?

### తిరుచానూరు-పాడిపేట వంతెనకు మోక్షమేది?

### ఏళ్లు గడుస్తున్నా హామీకే పరిమితం

### తాత్కాలిక మార్గమే నాలుగేళ్లుగా దిక్కు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

తిరుచానూరు-పాడిపేట వంతెన నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు తిరుచానూరు భూభాగం వైపుగా కుంగిపోయింది.. దశాబ్దాలుగా గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ బ్రిడ్జి హఠాత్తుగా కూలిపోవడంతో తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేశారు. నాలుగేళ్లుగా ఈ మార్గమే దిక్కు. వంతెన పున్ణ నిర్మిస్తామని పాలకులు చెప్పిన హామీలు ఏళు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేదు. దీంతో ఈ తాత్కాలిక మార్గమే 'తిరుచానూరు - పాడిపేట' రహదారిగా మారింది. కుంగిన వంతెన శిథిలమైపోతుంది.

**అక్రమ ఇసుక తవ్వకాలే కారణమా...?**

స్వర్ణముఖి నది నుండి పరివాహక ప్రాంతాలలో యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకాసురులు చేపట్టే తవ్వకాల మూలంగా దశాబ్దాల కాలంగా గ్రామాలకు గ్రామాలకు అనుసంధానంగా నిలిచిన వంతెనలు భారీ వర్షాలకు దెబ్బతింటున్నాయి అన్న విమర్శలు లేకపోలేదు. అధికారులు అక్రమ ఇసుక తవ్వకాలపై ఎప్పటికప్పుడు విధి నిర్వహణలో భాగంగా తగిన తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుములు విధిస్తున్నా ఇసుక అక్రమ రవాణా అనేది సాగిపోతూనే ఉంది. జాతీయ పర్యావరణ మంత్రిత్వ శాఖ తిరుపతి జిల్లా పరిధిలోని స్వర్ణముఖి, అరణియార్ నదులలో జూన్ మాసం నుండి అక్టోబర్ మాసం వరకు ఇసుక తవ్వకాలు జరపకూడదని ఆదేశాలు జారీ చేసింది. అవేవీ ఇక్కడ అమలు అయినట్టుగా కనిపించడం లేదు. యథేచ్ఛగా అధికారం మనదే కదా అని భావించే వారు ఇసుకను తెల్ల బంగారంగా భావించి ట్రిప్పులకు ట్రిప్పులు టిప్పర్లతో ఇసుకను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు రాజకీయ ఒత్తిడికి తలొగ్గి పర్యావరణానికి ముప్పు కలుగుతుంది అని తెలిసినా, నదీ పరివాహక ప్రాంతాలలో ప్రజలకు సేవలు అందిస్తున్న వంతెనలు కూలిపోతాయని తెలిసినా మౌనంగా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయనే చెప్పాలి.

**తాత్కాలిక మార్గమే దిక్కు**

నాలుగేళ్ల క్రితం భారీ వర్షాలకు స్వర్ణముఖి నదిపై తిరుచానూరు-పాడిపేట వద్ద కుంగిపోయిన వంతెన పక్కనే తాత్కాలిక మార్గాన్ని సర్పంచి కీరకట్టు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నేటికీ ఈ తాత్కాలిక మార్గమే గ్రామాల నుండి తిరుచానూరుకు, తిరుపతికి వచ్చే ప్రజలకు దిక్కు అయిన పరిస్థితి నెలకొంది. తాత్కాలిక మార్గానికే పరిమితమైన తిరుచానూరు-పాడిపేట మార్గంలో వంతెన పునర్నిర్మాణాన్ని పటిష్టంగా చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కంగిపోయిన తిరుచానూరు-పాడిపేట వంతెన

**హామీలకే పరిమితం...**

తిరుచానూరు-పాడిపేట వద్ద భారీ వర్షాలకు కుంగిపోయిన వంతెనను పునర్ నిర్మిస్తామని చెప్పిన పాలకులు హామీలకే పరిమితమయ్యారని స్థానిక ప్రజలు తీవ్రస్థాయిలో స్పందిస్తున్న పరిస్థితి కనబడుతోంది. నాలుగేళ్లయిన ఎవరూ పట్టించుకోకపోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మార్గాన్ని ఉపయోగిస్తూ అటుగా వివిధ అవసరాల నిమిత్తం వచ్చిపోయే ప్రజలు కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తిరుచానూరు-పాడిపేట వంతెనను పునర్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు. పాలకులు ఎలా స్పందిస్తారో వేసి చూడాల్సిందే.

# గుట్టలు.. గుటకాయ స్వాహా..

- ఏ గుట్టను వదలిపెట్టని అక్రమార్కులు
- తవ్వకాలపై స్థానికుల ఫిర్యాదులు
- పట్టించుకోని అధికారులు

టిప్పర్ల ద్వారా గ్రావెల్ మట్టిని తరలిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి- నగరి:** నగరి, విజయపురం మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్, మట్టిని అడ్డు అదుపు లేకుండా తవ్వేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. రోజురోజుకు గ్రావెల్, మట్టి తవ్వకాలు పెరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల అక్రమ తవ్వకందారులకు స్థానిక నేతలు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జాతీయ రహదారి, రైల్వే పనుల సాకు చూపి ముడిపల్లి, గుండ్రాజుకుప్పం, వీకేఆర్‌పురం, కీళపట్టు, తడుకుపేట, మహారాజపురం వద్ద గల గుట్టలను ఇష్టానుసారంగా దోచేస్తున్న అక్రమార్కుల కన్ను కొత్తగా నగరి మున్సిపాలిటీ, కాకవేడు లెక్కదాఖలా దిగువ పాండురాజుపురం వద్ద గల గుట్టలపై పడింది. వెంటనే వారికి అనుమతులు పుట్టుకొచ్చేసాయి. నిబంధనల ప్రకారం తీయాల్సింది గోరంత అయితే కొండంత మట్టిని దోచేస్తూ రోజుకు వందల టిప్పర్లు తరలిస్తూ కొన్ని రోజులకే గుట్టను గొయ్యిలా మార్చేశారు. ఒరిజినల్ బిల్లుల స్థానంలో నకిలీ బిల్లులను పెట్టుకొని యథేచ్ఛగా పనికానిచ్చేస్తున్నారు. సర్వే నెంబర్లు మార్చుకుంటూ కొత్త క్వారీ అని లెక్కలు చూపుతూ, ఓవర్ లోడ్డుతో వాహనాలు తరలిస్తూ దర్జాగా ధనార్జన చేస్తున్నారు. స్థానికులు దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్, పోలీసు శాఖల అధికారులు ఏమయ్యారంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో వేసే రోడ్లకు కూడా నగరి నుంచి మట్టి తరలించడమేంటని, అక్కడ గ్రావెల్ లేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల సాకుతో తమిళనాడుకు తరలిస్తూ అధికార పార్టీ అండదండలతో దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మహారాజపురం గ్రామంలోని క్వారీకి మైన్ అధికారులు అనుమతిచ్చింది. 35 వేల క్యూబిక్ మీటర్లు మాత్రమే. అయితే రోజుకు 200 టిప్పర్లు చొప్పున 15 రోజుల్లోనే 35వేల క్యూబిక్ మీటర్లు తరలించేశారు. వీరికి ఇచ్చిన సర్వేనెంబరుల్లో ఇచ్చిన అనుమతికన్నా ఎక్కువ తరలించేస్తుండటంతో పాటు ఎస్టీలకు ఇచ్చిన సర్వే నెంబర్లలోని భూముల్లోను వీరి ప్రతాపం చూపుతూ ఎడాపెడా తరలించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎలాంటి చొరవ చూపడం లేదు. తూతూ మంత్రంగా తనిఖీ చేసి రిపోర్టులు ఇచ్చి వెళ్లిపోతున్నారు.

**- శివకుమార్, మాజీ ఎంపీటీసీ, మహారాజపురం.**

గుట్టలను పూర్తిగా తవ్వేస్తున్న దృశ్యం

## స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

**ప్రజాశక్తి- ఐరాల:** శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారిని ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానం ఛైర్మన్ మణి నాయుడు, ఈవో పెంచల కిషోర్ వారిని స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేష వస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఛైర్మన్, ఈవో క్యూలైన్లోని భక్తులకు, చిన్నపిల్లలకు, వృద్ధులకు, బాదం పాలను, బిస్కెట్ ప్యాకెట్లు దేవస్థానం తరుపున అందజేశారు. అలాగే కాణిపాకం పోలీసు వారు ఏర్పాటు చేసిన చిన్న పిల్లలు తప్పిపోకుండా ఏర్పాటు చేసిన జియో టాకింగ్ను ప్రారంభించడం జరిగింది. ట్రస్ట్ బోర్డ్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, శివప్రసాద్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

## మండలానికి ఐఎస్ఓ సర్టిఫికెట్

**ప్రజాశక్తి- శాంతిపురం:** నాణ్యమైన పరిపాలన నిర్వహణకు గాను చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంకు ఐఎస్ఓ సర్టిఫికేట్ జారీ చేయబడినది. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్రైయేషన్ కలిగిన ఈ సర్టిఫికెట్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కె.రవికుమార్ నాయుడు ద్వారా శాంతిపురం మండల ఎంపీడీవో ఏపీఆర్.కుమార్, కార్యాలయ సిబ్బంది చిత్తూరు జిల్లా కార్యలయంలో గురువారం అందుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రణాళిక సమన్వయం, అమలు పర్యవేక్షణ, పరిపాలన నియంత్రణ మొదలగు కార్యక్రమాల పనితీరును పరిశీలించి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఎస్ఓ సర్టిఫికేట్ జారీ చేయబడిందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, సిఈఓ హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఇదే స్ఫూర్తితో నాణ్యతను కొనసాగించాలని ఎంపీడీవోను కోరారు.

## గోపీనాథ్‌కు గౌరవ డాక్టరేట్

**ప్రజాశక్తి- కుప్పం:** కుప్పం టిడిపి సీనియర్ నేత పి.గోపీనాథ్‌కు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. గడిచిన 40 ఏళ్లుగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ చేస్తున్న గోపీనాథ్ సేవలను గుర్తిస్తూ తమిళనాడు రాష్ట్రం హోసూరులో జరిగిన కార్యక్రమంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమిక్ వారు గౌరవ డాక్టరేట్ అందజేశారు. గోపీనాథ్ ప్రస్తుతం టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రాయచోటి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులుగా ఉన్నారు. గౌరవ డాక్టరేట్ తనపై బాధ్యత మరింత పెంచిందని, సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరం చేస్తామని ఆయన పేర్కొన్నారు. గోపీనాథ్ టిడిపి కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లు సోము, జాకీర్, గణపతి, విస్తరణ కమిటీ సభ్యులు మంజునాథ్, టిడిపి కొత్తపేట ఇంచార్జ్ అప్పు, కో క్లస్టర్ శ్యాంసుందర్, కృష్ణమూర్తి ఘనంగా సత్కరించారు.

# గంజాయి నుండి యువతను కాపాడుకుందాం..

**యుటిఎఫ్ కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్**

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

భావిభారత పౌరులను గంజాయి మహమ్మారి నుంచి కాపాడుకుందాం అంటూ యువతకు అవగాహన కల్పిస్తూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముద్రించిన కరపత్రాలను గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. యుటిఎఫ్ చిత్తూరు జిల్లాశాఖ పక్షాన గురువారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి జిల్లా కలెక్టర్‌ను కలిసిన సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర సంఘం రూపొందించిన భావి భారత పౌరులను గంజాయి మహమ్మారి నుంచి కాపాడుకుందాం అనే కరపత్రాన్ని ఆవిష్కరణ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గంజాయికి విద్యార్థులను దూరం చేద్దామని, రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకుందామనే నినాదంతో యుటిఎఫ్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని అన్నారు. అలాగే జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడుని, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్‌ని, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీమద్ది పట్ల వెంకటరమణిని, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావుని, పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్‌ని యుటిఎఫ్ శాఖ పక్షాన కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే. రెడ్డప్ప నాయుడు, ఎం.మణిగండన్, జిల్లా సహ అధ్యక్షులు రెహనా బేగం, ఏకాంబరం, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, జిల్లా కార్యదర్శులు పంటపల్లి సురేష్, పీసీ బాబు, వంశీకృష్ణ పాల్గొన్నారు.



యుటిఎఫ్ కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్

# ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** సరికొత్త చిత్రాలు హంగులతో ప్రజాశక్తి ముద్రించిన 2026 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు ఆవిష్కరించారు. ఎంతో ఉన్నత ఆశయంతో ప్రజాశక్తి దినపత్రిక ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ఎప్పటికప్పుడు తాజా వార్తలు ప్రజలకు అందిస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలుస్తున్న ప్రజాశక్తి దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. ప్రతి ఏడాది ప్రజాశక్తి ముద్రిస్తున్న క్యాలెండర్ ఎంతో ప్రజాభిమానాన్ని పొందుతోందన్నారు. తిరుపతి ఎడిషన్ మేనేజర్ సిఎస్.ప్రసాద్, చిత్తూరు డివిజన్ ఇంచార్జి దాము, ఫోటోగ్రాఫర్ సురేందర్‌రెడ్డి, విలేకరులు బాలసుబ్రమణ్యం, యాదమరి రాజేష్, తవణంపల్లి హరి పాల్గొన్నారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

జిల్లా ఎస్పీ

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** 2026 నూతన సంవత్సరం సందర్భంగా గురువారం జిల్లా సచివాలయంలోని ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ని వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు, పండ్లు, స్వీట్లు, మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2026 వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో ఎస్పీ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రైనీ ఏఎస్పి డాక్టర్ తరుణ్ పహ్వా, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇంచార్జ్ అడ్మిన్ ఎస్ఆర్.రాజశేఖర రాజు, 4 సబ్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. అలాగే చిత్తూరు పట్టణంలోని తపోవనంలోని అనాథ ఆశ్రమంలో పిల్లలతో కలిసి ఎస్పీ కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

**గంగాధర నెల్లూరు:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్‌ను టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్లు జ్యోతి యాదవ్, చిన్న, ప్రసాద్ నాయుడు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చంద్రబాబు గౌడ్ పాల్గొన్నారు.

**రొంపిచెర్ల:** సమాచార హక్కు చట్టం కార్యకర్తల సంఘం వ్యవస్థాపకులు జి.ముత్తు, రాష్ట్ర సెక్రటరీ జి.కిరణ్ కుమారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా అధ్యక్షులు, సభ్యులందరికీ నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిధున్ రెడ్డి తెలియజేశారు. మండల కేంద్రంలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కార్యకర్తల సంఘం క్యాలెండర్‌ను, డైరీలను ఆవిష్కరించారు. చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకులు హర్షిత్ రెడ్డి, సమాచార హక్కు చట్టం కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షులు పి.నరేష్, సభ్యులు పెద్ద రెడ్డప్ప, మనోహర్, నూరేషా, నాగుర్ షా, ఓబులేసు, అశోక్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**బైరెడ్డిపల్లి:** మండలంలో ప్రముఖ కాంట్రాక్టర్‌గా గుర్తింపు పొందిన విలవనాథం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ నాయకులను ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ జైకుమార్‌ను కండువా కప్పి, పూలమాలలు వేసి, కేకులు కట్ చేసి స్వీట్లు తినిపిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మొగసాల కుటుంబీకులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి, డిసిసిబి ఛైర్‌పర్సన్ కృష్ణమూర్తి, జిల్లా ఎంపిపి అధ్యక్షులు ఎం.రెడ్డప్ప నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రొంపిచెర్లలో

**వెదురుకుప్పం:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాజీ డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి, జీడి నెల్లూరు నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ కృపాలక్ష్మిలకు నియోజకవర్గ వైద్య విభాగం అధ్యక్షులు కోలార్ ప్రకాష్ ఆధ్వర్యంలో నాయకులు శాలువ కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా వైసిపి నేత బట్టే సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, యువనేత నవీన్, బట్టే రేవంత్ పాల్గొన్నారు.

**యాదమరి:** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పార్థసారథికి కార్యాలయ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీరేంద్ర, యాదమరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఈశ్వరయ్య, మహిళా సమైక్య కార్యాలయంలో ఏపిఎం ఈశ్వరి, మాదిరెడ్డిపల్లి పీహెచ్సీలో డాక్టర్ వరప్రసాద్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



వెదురుకుప్పంలో..



బైరెడ్డిపల్లిలో..

## వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం నాయకులు, రొంపిచర్ల మండలం వీఆర్‌ఏలు లక్ష్మణ, ఎస్ ఇర్ఫాన్ అలీ ఆధ్వర్యంలో పలువురు వీఆర్‌ఏలు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను గురువారం కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, వీఆర్‌ఏలకు జీతం పెంపు, ప్రమోషన్లు, నామినీలకు సంబంధించిన సమస్యలను ఈనెల 8న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. వీఆర్‌ఏల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని అన్నారు. ఈ ఏడాదిలో వీఆర్‌ఏలకు శుభవార్త ఇస్తామని చెప్పారు. అనంతరం మంత్రి సత్య ప్రసాద్‌ను, సీసీఎల్‌ఏ అధికారి జయలక్ష్మిలను శాలువాలతో సన్మానించారు.

## కడ పీడీని కలిసిన ఉద్యోగులు

**ప్రజాశక్తి- కుప్పం:** కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌ను కుప్పం నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్‌డిఓ శ్రీనివాసరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణతో పాటు ఉద్యోగులు పీడీని ఘనంగా సత్కరించారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసి సమిష్టిగా పనిచేద్దామని పీడీ పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పీడీ తెలిపారు.

## కిరణ్ కుమార్‌కు ఘన సన్మానం

**ప్రజాశక్తి- పలమనేరు:** రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం పలమనేరు సబ్ ట్రెజరీ ఆఫీసరు కిరణ్ కుమార్‌ను శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సబ్‌ట్రెజరీ ఆఫీసర్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గురువారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా ఆన్‌లైన్లో లైఫ్ సర్టిఫికెట్లు సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి కార్యాలయానికి వచ్చిన 75 మందికి జీవన్ ప్రమాణ్ యాఫ్ ద్వారా పెన్షన్‌ఇన్ చార్జ్ గుణశేఖర్ ఆధ్వర్యంలో పూర్తి చేసి నామినీ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురు రాజారావు, పెన్షనర్ల నాయకులు గౌస్, గౌడు, క్రిష్ణమూర్తి, మోహన్, గురుస్వామి నాయుడు, వినాయకం, నర్సింహులు, ప్రకాష్ పాల్గొన్నారు.

# అప్పుచేసి పిల్లల కడుపు నింపుతున్నాం 'సీతమ్మా'

# మా డొక్కలు నిండేదెప్పుడు...?

## 'అక్షయపాత్ర' వైపు పాలకుల చూపు

- మూడు నెలలుగా అందని బిల్లులు, వేతనాలు
- కడుపు మాడ్చుకుంటున్న ఎండీఎం కార్మికులు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి, వారి ఆకలి తీరుస్తున్న వంట కార్మికులు పస్తులతో సతమతమవుతున్నారు. నెలల తరబడి మధ్యాహ్న భోజనం బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. మరో వైపు వేతనాలు పెండింగ్ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 1500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో లక్ష మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకం కింద భోజనం అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకానికి జగనన్న గోరుముద్దగా పేరు పెట్టి అమలు పరచగా, కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద మార్పు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం పనికితగ్గా వేతనం ఇవ్వకపోగా నెలల తరబడి బిల్లులు, వేతనాలు పెండింగ్ లో ఉంచి మధ్యాహ్న భోజన కార్మికుల డొక్కలు మాడ్చుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పైగా పథకాన్ని అక్షయ పాత్రకిచ్చి తమ పొట్ట కొట్టేస్తారేమోనని ఆందోళన పడుతున్న పరిస్థితి.

### మూడు నెలల బిల్లులు పెండింగ్

మధ్యాహ్న భోజన పథకం అమలుపై ద ష్టి సారించిన కూటమి సర్కారు ఆ పథకం నిర్వహించే ఏజెన్సీ కార్మికుల సంక్షేమాన్ని మాత్రం విస్మరించింది. ఈ విద్యా సంవత్సరంలో సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెల బిల్లులు అందలేదు. డిసెంబరు కూడా గడిచిపోయింది. అయినా ప్రభుత్వం పెండింగ్ బిల్లుల ఊసెత్తటం లేదు. మూడు నెలలుగా రెండు కోట్లకు పైగా బిల్లులు విడుదల కావాల్సి ఉంది. ఈ బిల్లులు విడుదల కాకపోవటంతో కార్మికులు అప్పులు తెచ్చి మరీ ఏజెన్సీలను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి చిక్కీ, గుడ్లు, బియ్యం, తాటి బెల్లం, రాగిపిండి అందిస్తోంది. వంటలకు అవసరమైన వస్తు సామగ్రి గ్యాస్, కూరగాయలు, వంట నూనెను కార్మికులే సమకూర్చుకుని విద్యార్థులకు సకాలంలో భోజనం అందిస్తున్నారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్ పడుతున్నా, తమ అవస్థలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మిడ్డే మీల్స్ కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంతేకాకుండా బిల్లులు చెల్లించకపోగా, వాటిలోనూ కోతలు విధిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రూ.10 వేలకు బిల్లు పెడితే రూ.8 వేలు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేస్తుండటంతో ఆర్థికంగా నష్టం జరుగుతోందని కొందరు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వాపోతున్నారు.

### వేతనాలు కూడా పెండింగే

బిల్లులుతో పాటు వేతనాలు కూడా పెండింగ్లోనే పడుతున్నాయి. మిడ్డే మీల్ కార్మికులకు రూ.3 వేల వేతనం అందుతుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేల మంది కార్మికులకు ప్రభుత్వం వేతనాలు బకాయి పడింది. నెలలో 27 రోజులు సేవలందిస్తున్న తమకు ఈ వేతనం ఏ మూలకూ సరిపోవడం లేదని కార్మికులు అంటున్నారు. దానిలో కూడా బకాయి పెడితే కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నిస్తున్నారు. తమకు కనీసం రూ. 10 వేలైనా వేతనంగా ఇవ్వాలని కోరుతున్నారు.

### అప్పు చేసి పప్పుకూడు

**జయమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు**

పేద విద్యార్థుల కడుపు నింపేందుకు మా కడుపులు మాడ్చుకుంటున్నాం. అప్పులు చేసి పప్పు కూడు పెడుతున్నాం. మా కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. నెల నెలా అప్పులే మిగులుతున్నాయి. పెండింగ్ బిల్లులు, వేతనాలు మంజూరు చేయాలి.

# శెట్టిపల్లి లేఅవుట్ సంక్రాంతి కానుక

## 15న సిఎం చేతుల మీదుగా కేటాయింపు
## రిజిస్ట్రేషన్ ఫీజు పూర్తిగా మినహాయింపు
## మోడల్‌సిటీగా తీర్చిదిద్దుతాం : కలెక్టర్

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

శెట్టిపల్లి లేఔట్ డెవలప్‌మెంట్ పనులు పూర్తయ్యాయని, అర్హులైన వారికి లాటరీ విధానంలో ఈనెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంపిక చేయనున్నారని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చెప్పారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, తుడా, సంబంధిత అధికారులతో శెట్టిపల్లి గ్రామ కమిటీలు, వ్యవసాయదారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ శెట్టిపల్లి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడంతో శెట్టిపల్లి లేఔట్ డెవలప్‌మెంట్ పనులకు సర్వం సిద్ధం చేశామని, అర్హులైన వ్యవసాయదారులకు, ప్లాటుదారులకు రెండు సెంట్లు తక్కువ లేకుండా ప్లాట్లు కేటాయిస్తామన్నారు. లాటరీ పద్ధతిలో 15న ముఖ్యమంత్రి లబ్దిదారులను ఎంపిక చేస్తారన్నారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఉచితంగా ఉంటుందన్నారు. అర్హులైన లబ్దిదారులకు అందించే రిజిస్ట్రేషన్ పత్రాలు పక్కాగా హద్దులతో సహా ముద్రించి ఇచ్చే విధంగా తుడా, రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. అనంతరం ఒక రోజున పండుగ వాతవరణంలో పట్టాలను పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మోడల్ టౌన్ షిప్ కు సంబంధించి తుడా ద్వారా 65 ఎకరాలు కేటాయించామన్నారు. అందులో భాగంగా శెట్టిపల్లిలో ఆధునిక మౌలిక సదుపాయాలతో కూడిన లేఔట్ నిర్మాణంతో పాటు వాణిజ్య భవనాలు, అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, తాగు నీరు, విద్యుత్, దేవాలయం, పార్కులు, శ్మశానవాటిక వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు తిరుపతి రెవెన్యు అధికారి రాంమోహన్, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవి కుమారి, తుడా భూ సేకరణ అధికారి సుజన, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి వాణిశ్రీ, సూర్యనారాయణమ్మ, వాసుదేవనాయుడు ఎస్ఈ కృష్ణారెడ్డి, తిరుపతి అర్బన్ తహశీల్దార్ సురేష్, బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు, తుడా సర్వేయర్ దేవానంద్, గ్రామ సర్వేయర్లు, ఏ ఈ సి ఓ ఎంసంస్థ ప్రతినిధులు, డి టి రామచంద్ర వి ఆర్ ఓ ప్రసాద్, సర్వేయర్ రమేష్ పాల్గొన్నారు.

రహదారి నిబంధనలను విధిగా పాటించాలి

## మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని ఛాంబర్‌లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించి, గోడ పత్రికలను, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారిపై జాగ్రత్తగా వాహనాన్ని నడపడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చు అని అన్నారు. జరుగుతున్న ప్రమాదాలలో 90శాతం నిబంధనలు పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జనవరి 1 నుంచి నుండి 31 వరకు జరుగుతాయని, ఈనెల రోజుల పాటు రహదారి భద్రతా నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు, వాహన చోదకులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీవో నిరంజన్ రెడ్డి, ఇతర రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) వార్షిక క్యాలెండర్‌ను గురువారం మండలంలోని ఎంఆర్‌సిలు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు మహేష్‌బాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడి సమస్యలను పరిష్కరిస్తున్నదని వారి వార్షిక క్యాలెండర్‌ను ప్రారంభించడం శుభ పరిమాణం అన్నారు. గౌరవ అధ్యక్షులు వై.కృష్ణయ్య, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి బాలాజీ, జిల్లా కార్యవర్గసభ్యులు సరిత, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా పవిత్రా రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రా రెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. పలువురు వైసిపి అభిమానులు కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. వైసీపీ సీనియర్ నేత, ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి పవిత్రా రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## టీటీడీకి రూ.78 లక్షల విలువైన ఔషధాలు విరాళం

**ప్రజాశక్తి - తిరుమల:** హైదరాబాద్‌కు చెందిన త్రిశూల్ ఎంటర్ ప్రైజెర్స్ సంస్థ అధినేతలు చక్రధర్, శివరంజనిభక్తులు గురువారం టీటీడీకి రూ.78 లక్షల విలువైన ఔషధాలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాతల తరఫున టీటీడీ బోర్డు సభ్యులు సదాశివరావు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు ఔషధాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్ పాల్గొన్నారు.

## టాస్క్ ఫోర్స్‌లో నూతన సంవత్సర వేడుకలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఎండి షరీఫ్, ఏసిఎఫ్ శ్రీనివాస్ నేతత్వంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ శ్రీనివాస్ కేక్ కట్ చేసి కొత్త ఏడాదిలో ఎర్రచందనం పరిరక్షణలో మరింత చురుగ్గా విధులు నిర్వర్తించి పూర్తిస్థాయిలో నిరోధనకు అడ్డుకట్ట వేయాలని, స్మగ్లర్లను అడవిలోనికి రానివ్వకుండా చేసే ప్రయత్నాలు విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. అనంతరం టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడును మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు

**ప్రజాశక్తి -కోట :** అర్హులైన వారికి క్రొత్త పాస్ బుక్‌లు మంజూరు చేసినట్లు కోట తహశీల్దార్ కటారి జేజే రావు తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో నాలుగు గ్రామాల రీ సర్వే జరపడం జరిగిందని తెలిపారు. నెల్లూరుపల్లి, కొత్తపాలెం గ్రామాలకు చెందిన 173 మంది పాసుబుక్కులు మంజూరుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా లక్ష్మక్క కండ్రిగకు చెందిన 109 మందికి పాస్ బుక్‌లు మంజూరు కావడం జరిగిందన్నారు. పాసుబుక్కులను 2,3 తేదీల్లో నెల్లూరుపల్లి, కొత్తపాలెంలో పంపిణీ చేస్తామని, లక్ష్మక్క కండ్రికలో 5,6 తేదీల్లో పంపిణీ చేస్తామన్నారు. రైతులు రెవెన్యూ అధికారులకు అందుబాటులో ఉండి పాత పాసుబుక్‌లను రెవెన్యూ కార్యాలయానికి అందజేసి నూతన పాస్ బుక్‌లను తీసుకోవాలన్నారు.

## స్ప్రింగ్ ఫెస్ట్ లో ఎమరాల్డ్స్ విజయ కేతనం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్ప్రింగ్ ఫెస్ట్ 2025లో తిరుపతి ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చూపి విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్లు విశ్వనాథ్, గిరిధర్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి ద్వితీయ సంవత్సరం బిబిఏ కోర్సును అభ్యసిస్తున్న కావ్య ప్రతిష్టాత్మకమైన యంగ్ మేనేజర్ అవార్డును సొంతం చేసుకున్నారన్నారు. అలానే జస్వంత్, పవన్, శ్రీవంత్ బిజినెస్ క్విజ్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, నాదముని, అధ్యాపకులు జాషువా, భాను కిరణ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్త జనసంద్రంగా ఆలయాలు

**ప్రజాశక్తి- కుప్పం:** కుప్పంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సర అన్ని పురస్కరించుకొని కుప్పం మున్సిపాలిటీ లక్ష్మీపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ఊర్లఓబనపల్లి శ్రీ బేటరాయ స్వామి ఆలయం, కంగుంది శ్రీ విరుపాక్షేశ్వర ఆలయం, కంగుంది దుర్గంపై ఉన్న శివాలయం, పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయం, శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, రాముల గుడి, సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వెదురుకుప్పం:** నూతన సంవత్సర అన్ని పురస్కరించుకొని మండలంలోని దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.మాంబేడు గ్రామపంచాయతీలో డిఆర్ఎన్ కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై వెలసిన శ్రీ శివాలయం శివ నామస్మరణతో మారు మ్రోగింది. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేశారు.

**గంగాధర నెల్లూరు:** మండలంలోని తూగుండ్రం పంచాయతీ తూగుండ్రం గ్రామంలో శ్రీచల వెంకటేశ్వర పెరుమాలస్వామి దేవస్థానంలో నూతన సంవత్సర అన్ని పురస్కరించుకొని ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రామస్వామి శేఖర్ మొదలి, భక్తులు పాల్గొన్నారు.

**బంగారుపాళ్యం:** ఆంగ్ల నూతన సంవత్సర పురస్కరించుకుని ఆలయాలు గురువారం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం గావించారు. మొగలిలోని శివాలయం వజ్రాలపురం గంగమ్మను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

## సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ దాతలను సత్కరించిన స్విమ్స్

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ విభాగంలో అత్యధిక సంఖ్యలో పునరావత సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ (ఎస్డిపి) దాతలను స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్ గురువారం సత్కరించారు. స్థానిక స్విమ్స్ సంచాలకుల కార్యాలయంలో డైరెక్టర్ డాక్టర్ ఆర్వి కుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్లేట్‌లెట్ దానం ద్వారా ప్రాణాలను కాపాడటంలో దాతలు చూపిన అద్భుతమైన నిబద్ధతకు వారిని అభినందించారు. ప్రాణాలను రక్షించే దానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దాతలు టి.ధనంజయ, కృష్ణవర్ధన్‌బాబు, రాజేష్‌బాబు, పూజారి రవి, ప్రదీప్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ కెవి శ్రీధర్‌బాబు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు బ్యాగులు పంపిణీ

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** ఎపిపిటిడి (ఆర్.టి.సి) మంగళం డిపో గురువారం ఎంప్లాయిస్ యూనియన్ మంగళం డిపో గౌరవ అధ్యక్షులు, వాకర్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీ శ్రీనివాస అర్యాట్ కష్ణ ప్రసాద్ ఉద్యోగులకు ట్రావలింగ్ బ్యాగ్, డైరీ, స్వీట్, కేలండర్ అష్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచితంగా పంపిణి చేశారు. మంగళం డిపో ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని అన్నారు. ఉద్యోగుల పిల్లల చదువుల విషయంలోనూ, ఆస్పత్రి అవసరాల విషయంలోనూ తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇ.రమేష్‌కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆలమడుగు మురగమ్మ, జోనల్ కమిటి సభ్యులు ఎ.మనోజ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిఆర్ చంద్ర, వి.మస్తాన్ పాల్గొన్నారు.

# క్రైం న్యూస్

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి- చౌడేపల్లి:** ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మరణించిన సంఘటన చౌడేపల్లి మండలంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని పంచాయతీ కేంద్రం ఏ కొత్తకోటకి చెందిన కుమ్మరి వెంకటరమణ తన సొంత పనుల నిమిత్తం దాదేపల్లికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. గ్రామంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొనడంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## మండలాల తగ్గింపు బాధాకరం : కాంగ్రెస్

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే గూడూరులో జిల్లా కేంద్రం చేస్తామని, ఎంతోకాలంగా ఉన్న రెవెన్యూ డివిజన్ కేంద్రం నేడు మూడు మండలాలకే పరిమితమవడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ గూడూరు ఇన్చార్జ్ డాక్టర్ రామకృష్ణారావు వెల్లడించారు. గూడూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే గూడూరు రెవిన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు అయిందని, 19 మండలాలతో కొనసాగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇటీవల గూడూరు నియోజకవర్గంలోని రెండు మండలాలను తిరుపతిలో, మూడు మండలాలను నెల్లూరు జిల్లాల్లో కలిపిందని, గూడూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంలో ఇప్పుడు మూడు మండలాలు మాత్రమే ఉన్నాయన్నారు. పెద్ద రెవిన్యూ డివిజన్‌ను మూడు మండలాలకు పరిమితం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. గూడూరును జిల్లా కేంద్రం చేయడానికి అన్ని వనరులు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గూడూరును జిల్లా కేంద్రం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పంట శ్రీనివాసులు రెడ్డి, పూల చంద్రశేఖర్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE VIII ADDL. DISTRICT JUDGE OF CHITTOOR**
**IA NO. 04 OF 2024**
**CMA.NO. 18 OF 2018**
**EA NO. 73 OF 2015**
**OEP NO. 49 OF 2014**

Between
M.Babu @Venugopal Naidu & others
... Appellants/Claim Petitioners
And:
N.Kuppaiah Naidu & another
..Respondents/Respondents

**NOTICE TO RESPONDENTS 7 & 8**

To
**7. Smt. Bharathi**, W/o Bhaskar Naidu,
**8. Smt. Dharani,** W/o Suri,
Both are residing at Pulliahgaripalli Village, Madhavaram Post, Yadamari Mandal, Chittoor District-517 422.
Sir,
Please take notice that the petitioners have filed petition under **ORDER 22 RULE 9 & Sec.151 of C.P.C**. to set aside the abatement order if any as against the legal heirs of deceased 2nd Respondent / N. Kuppaiah Naidu i.e., Respondents 3 to 8 in the above appeal. If you have got any objection you may appear before this Court at 10.30 A.M., on 29-01-2026 either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.

**Sd/-V.RAMANARAYANA REDDY**
Advocate for the Petitioner
Chittoor, 01.01.2026

**IN THE COURT OF THE VIII ADDL. DISTRICT JUDGE OF CHITTOOR**
**IA NO. 05 OF 2024**
**CMA.NO. 18 OF 2018**
**EA NO. 73 OF 2015**
**OEP NO. 49 OF 2014**

Between
M.Babu @Venugopal Naidu & others
... Appellants/Claim Petitioners
And:
N.Kuppaiah Naidu & another
..Respondents/Respondents

**NOTICE TO RESPONDENTS 7 & 8**

To
**7. Smt. Bharathi**, W/o Bhaskar Naidu,
**8. Smt. Dharani,** W/o Suri,
Both are residing at Pulliahgaripalli Village, Madhavaram Post, Yadamari Mandal, Chittoor District-517 422.
Sir,
Please take notice that the petitioners have filed petition under **ORDER 22 RULE 4 & 5 & Sec.151 of C.P.C. and Rule 28 of C.R.P** to bring the legal representatives of deceased 2nd Respondent i.e N. Kuppaiah Naidu on record as Respondents 3 to 8 in the above appeal. If you have got any objection you may appear before this Court at **10.30 A.M., on 29-01-2026** either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.

**Sd/-V.RAMANARAYANA REDDY**
Advocate for the Petitioner
Chittoor, 01.01.2026